వాడవాడలా మేడే





కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గంగనపల్లెలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) పురస్కరించుకుని చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్మిక జెండాలు ఆవిష్కరించారు. ర్యాలీలు చేశారు. అన్నదానాలు, వస్త్ర దానాలు చేశారు. మేడే ప్రాముఖ్యతను ముఖ్యఅతిథులు వివరించారు.

చిత్తూరు కార్పొరేషన్: కార్మికులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. మే డే పురస్కరించుకుని సోమవారం స్థానిక హైరోడ్డులో జాగరీ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ హక్కులను వినియోగించుకుంటూ బాధ్యతగా సమాజంలో మెలగాలన్నారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

కార్మికుల కష్టం వెల కట్టలేనిదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద తెలిపారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో బెల్లం అమ్మకాలు ఎక్కువగా సాగేవని, వాటి కార్మికులకు పని దొరికేదన్నారు. అనంతరం కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

స్థానిక అంబేడ్కర్ విగ్రహం, సుందరయ్యవీధి, పత్తి ఆటోస్టాండ్, సిమెంట్, జనరల్, ఫీడ్ హమాలీ యూనియన్ కార్యాలయాలు, ఎంఎస్ఆర్ కాంప్లెక్స్, భగత్‌సింగ్, ఎంజీఆర్, న్యూట్రిన్ ఆటోస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ, కార్మికుల సహకారం లేనిదే సమాజం నడవదన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు.

ట్రాన్స్‌కో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక గాంధీ రోడ్డులోని యూనియన్ ఆఫీసులో కార్మిక జెండాను నాయకులు ఆవిష్కరించారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. నాయకులు గోవిందరాజులు, గోవిందన్, శిఖామణి, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కార్మిక జీవన చిత్రం

హైరోడ్డులో కార్మికులు ఉప్పుతో వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. కరోనా కష్ట సమయంలో గ్యాస్, కరెంటు, ఇంటి అద్దెలు మోస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నట్లు చిత్రాన్ని గీశారు.

నగరపాలకసంస్థ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలకసంస్థ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు.అలాగే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సీపీఐ నాయకులు జెండా ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆర్టీసీ బస్టాండులోనూ వేడుకలు నిర్వహించారు. తొలుత జానపద గేయాలు ఆలపిస్తూ డప్పు వాయిస్తూ ర్యాలీ చేశారు.

గంగనపల్లెలో..

చిత్తూరు రూరల్: చిత్తూరులోని గంగనపల్లె ఆటో యూనియన్ అధ్యక్షుడు మాలిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి ముఖ్యఅతిథిగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలా కృషి చేస్తున్నారని, నగరంలోని ఆటో కార్మికులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. త్వరలోనే చిత్తూరులోని ఆటో కార్మికులందరికీ బట్టలను పంపిణీ చేస్తామని ఆయన ప్రకటించారు.

ఆటోడ్రైవర్లకు యూనిఫాం పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. స్థానిక సంతపేటలోని ఆటోస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

యాదమరి: కార్మికులు మే డే స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ జెండాను ఎగుర వేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రైవేటు కల్యాణం మండపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉండాలని, ఎవరికి సమస్య వచ్చినా అందరూ కలసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షకీలా, ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు దుర్గ తదితరుల పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే కార్మిక హక్కుల సాధన

బంగారుపాళెం: ఉద్యమాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని మండల పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి పొన్మణి, మధు అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో సోమవారం పంచాయతీ, భవన నిర్మాణ కార్మికులు ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతాంగ కార్యవర్గ సభ్యులు శంకర్, భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శంకర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని(మే డే)ని ఐటీఎఫ్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఎఫ్‌యూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సంతపేట ఆటోస్టాండ్ వద్ద..







కలెక్టర్ బంగ్లా సమీపంలో కార్మిక జెండా ఆవిష్కరించిన నాగరాజన్, నగరంలో అన్నదానం చేస్తున్న కార్మిక నాయకులు, నగర పాలక సంస్థ వద్ద..







యాదమరి: సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నేతలు, బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో..., గాజులపల్లెలో..

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం



ఐరాల: మండలంలోని పుత్రమద్ది అభయాంజనేయస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం వేడుకలను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున 4 నుంచి 5 గంటల మధ్య అర్చకులు 40 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసి వేద మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ హోమాలు, వాస్తు పూజ, అంకురార్పణ, అంకురారోహణం పూజలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఆలయ మహా కుంభాభిషేకం మహోత్సవం నిర్వహించారు.

వేడుకగా ద్రౌపదీదేవి కల్యాణం

- హాజరైన చిత్తూరు ఎమ్మెల్యే దంపతులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

యాదమరి: మండలంలోని లక్ష్మయ్యకండ్రిగ గ్రామంలో వెలసిన ద్రౌపదీదేవి ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీ కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహాభారత యజ్ఞంలో భాగంగా ద్రౌపదీదేవి ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం పాండవుల విగ్రహాలను పెళ్లి కుమారులుగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించి పెళ్లి మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రాల మధ్య ద్రౌపదీదేవి పాండవుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణానికి ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు. వారిని ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం దంపతులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు హరిబాబు నాయుడు, రఘునాథయ్య, వెంకటాద్రి నాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు



తవణంపల్లెలో రోడ్డు ఆక్రమణలపై వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

తవణంపల్లె: మండల కేంద్రం తవణంపల్లెలో రోడ్డు ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరింపజేయాలని మండల వైస్ ఎంపీపీ శోభారెడ్డి, సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డికి పలువురు విన్నవించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తవణంపల్లె అభివృద్ధి కమిటీ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్, స్థానికులు రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారి ఆక్రమణలకు గురికావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని రోడ్డు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని వారు వివరించారు. ఆక్రమణల తొలగింపుపై రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. అధికారులు స్పందించి తవణంపల్లెలో రోడ్డు ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరించాలని, లేదంటే ఆందోళనకు దిగుతామన్నారు. దీనిపై వైస్ ఎంపీపీ శోభారెడ్డి స్పందిస్తూ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం



గ్రామాల్లో గెరిగను ఊరేగిస్తున్న భక్తులు

యాదమరి: యాదమరిలో తిరుపతి గంగమ్మ జాతర సోమవారం గెరిగ పూజతో భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ముందుగా ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి భక్తిశ్రద్ధలతో సుగంధ పుష్పాలతో గెరిగను ప్రతిష్ఠించారు. అనంతరం 24 గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు గెరిగకు ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం రాత్రి ముత్యాలమ్మ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి విద్యుత్ కటౌట్‌లు భక్తులను ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి.

కల్పవృక్ష వాహనంపై కోనేటిరాయుని వైభవం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

గంగవరం: కీలపట్లలోని శ్రీకోనేటిరాయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు శ్రీకృష్ణుడి అవతారంలో రుక్మిణీ సత్యభామ సమేతంగా కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కోనేటిరాయస్వామికి ఉదయం అభిషేకం, నైవేద్యం, మహా మంగళహారతి సమర్పించారు. ఆస్థాన మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి కోనేటిరాయుడు సర్వభూపాల వాహనంపై గ్రామ మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. చెక్కభజనలు, కోలాటాలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వాహన సేవలు కోలాహలంగా సాగాయి. నేడు జగన్మోహిణి ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గరుడసేవ నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

భూమి పూజలో ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

చిత్తూరు రూరల్: చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో సోమవారం శ్రీ చైతన్య వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజ చేసి ఎమ్మెల్యే చేత పునాదిరాళ్లు వేయించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, నాయకులు సునీత, రఘురాం, కుప్పరాజు పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలి



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని చెర్లోపల్లె సచివాలయ పరిధిలో ఉన్న తొడతర గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ వాహనం దగ్గర ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అదేవిధంగా గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మెడిసిన్ అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కొత్తపల్లె



బహుమతి అందుకుంటున్న కొత్తపల్లె జట్టు

గుడిపాల: వాలీబాల్ టోర్నీ విజేతగా కొత్తపల్లెగా నిలిచింది. మండలంలోని రాసనపల్లెలో గ్రామస్తులు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పది టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో 189కొత్తపల్లె జట్టు–రాసనపల్లె జట్టుపై గెలిచింది. విన్నర్స్, రన్నర్స్‌కు వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5వేలు, రూ.3వేలు, పేయనపల్లె జట్టుకు రూ.2వేలు అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



బంగారుపాళెం: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. మండలంలోని గుంతూరుకు చెందిన సుకుమార్(29) గ్రామ సమీపంలో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 24(90ఎంఎల్) టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

కాళభైరేశ్వర ఆలయంలో విశేష పూజలు



తవణంపల్లె కాళభైరేశ్వర ఆలయంలో కలశ ఆరాధన చేస్తున్న భక్తులు

తవణంపల్లె: తవణంపల్లెలో వెలసిన శ్రీ కాళభైరేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని కాళభైరేశ్వరుడు, నందీశ్వరుడు, శివలింగానికి, నాగాలమ్మకు అర్చకులు ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కలశపూజ, గణపతి హోమం చేపట్టారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సినీనటుడు అజిత్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్: తమిళ సినీనటుడు అజిత్ జన్మదిన వేడుకలను చిత్తూరులోని అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనాథశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. వీరం వినోద్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అభిమానులు లింగ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి పనికీ వసూల్ రాజాలే!

- రెవెన్యూ శాఖలో పెచ్చరిల్లిన అవినీతి
- ఇంటి పట్టాలు ఇచ్చి వాపస్ తీసుకున్నారు
- పదుల సంఖ్యల్లో లబ్ధిదారులు
- ఆన్‌లైన్‌లో ఇంకా లబ్ధిదారుల పేర్లే చూపెడుతున్న వైనం



రెవెన్యూ శాఖలో ప్రతి పనికీ వసూళ్లపర్వమే కొనసాగుతోంది. ఇంటి పట్టాలు పొందాలంటే లంచం ఇవ్వనిదే పనులు చేయడం లేదని పదుల సంఖ్యలో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు..డిమాండ్ చేసినంత ఇవ్వకపోతే ఇక వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉండాల్సిందేనని వాపోతున్న వారికీ కొదువ లేదు. పేదల ఇంటి కల సాకారం చేస్తామని ప్రభుత్వం ముందుకువెళ్తున్నా ఆ కలను రెవెన్యూ ఉద్యోగులు కల్లలు చేస్తున్నారని కన్నీటిపర్యమవుతున్నారు. –గుడిపాల

వెప్పాల పంచాయతీ సర్పంచ్ గోపి ఆవేదన ఆయన మాటల్లోనే..



"మా పంచాయతీలో 20మంది వరకు ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయినా. ప్రభుత్వ భూమి ఎక్కడా లేదంట! అందుకే ఇవ్వడానికి కుదరడం లేదంట! ఇదీ వాళ్లు చెప్పే సమాధానం. ప్రభుత్వ, పోరంబోకు భూములు ఉన్నా పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వరో ఇక దేవుడికే ఎరుక. అంతేకాదు; పంచాయతీ ఆఫీసు కట్టేదానికి కూడా ఇంతవరకూ భూమి చూపలా..తిప్పించుకుంటానే ఉండారు."

మరో మహిళ ఏమంటున్నారంటే..



నా పేరు జయంతి. మాది గుడిపాల ఆది ఆంధ్రవాడ. నాకు ప్రభుత్వం నుంచి ఇంటి పట్టా మంజూరైంది. పట్టా నంబర్ 6 అని ఆపీసర్లు చెప్పినారు. లిస్టులో నా పేరు కూడా ఉంది. సచివాలయంలో పెట్టినారు. జగనన్న ఇల్లు వచ్చినట్లేనని ఆనందపడినా. నా దగ్గర ఉన్న ఇంటి పట్టాను వీఆర్వో తాసీల్దారు ఆపీసులో ఇచ్చేసినాడు. అడిగితే తాసీల్దారుతో మాట్లాడుకోమ్మా..అని చెప్పినాడు. తాసీల్దారును కలిసినా. రెండు రోజులు తిప్పించుకున్నారు. పట్టా ఇచ్చేదానికి కుదరదని చెప్పినారు. మాకిచ్చిన పట్టా ఎట్లా మాయమైంది సార్? అని అడిగితే ఏం చెప్పలా. ఇంక ఆ జగనన్నో..పెద్దాపీసర్లు చెప్తేగానీ ఈరేమో పట్టా నాకు. పట్టాలిస్తే ఇల్లు కట్టుకునేవాళ్లు చానామందే ఉండారు. వీళ్లిస్తే కదా..!?

సర్వే చేస్తే రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు వసూలు

రైతులకు సంబంధించి సర్వే చేస్తే రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల పేయనపల్లెకు చెందిన ఓ మహిళా రైతు తనకు ఉన్న0.20 సెంట్ల భూమిని కొలవాలని సర్వేయర్‌కు చలానా కట్టి ఇచ్చింది. 10రోజులు తిప్పించి సర్వేకి వస్తే రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ మహిళా రైతు చేసేది లేక రూ.5వేలు వారికి సమర్పించింది. అయితే ఇంతవరకు వారికి సర్వే రిపోర్ట్ మాత్రం ఇవ్వలేదు. దీనిపై నిలదీస్తే.. మరికొంత ఇస్తేనే సర్వే రిపోర్ట్ ఇవ్వడానికి కుదురుతుందని, మీ పక్క రైతు నీకు ఇవ్వకూడదని ఫిర్యాదు చేశాడని చెవిలో పూలు పెడుతున్నారట! ఇలా మండలంలో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

హామీలను నెరవేర్చిన ప్రభుత్వం



తంబుగానిపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల హామీలను నెరవేర్చి, నవరత్న పథకాలతో పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని తంబుగానిపల్లె, హుస్సేన్‌పురం, దళితవాడ, కొత్తవెంకటాపురం, కేబీఎస్ కండ్రిగలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

రైతుభరోసా కేంద్రం ప్రారంభం

తంబుగానిపల్లెలో ప్రభుత్వం రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం జిల్లేడుపల్లె గ్రామ సచివాలయంలో అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో వివిధ అంశాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, ఎంపీటీసీలు శంకర్‌రెడ్డి, హేమచంద్ర, సర్పంచులు భారతమ్మ, బాలాజీ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్‌బీసీ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, పార్టీ నాయకులు దొరస్వామి, నాగరాజ, ప్రభునాయుడు, చంద్రారెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ బెన్నురాజ్, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేగవంతంగా హౌసింగ్ పనులు



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 902 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారన్నారు. మిగిలిన 800 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పర్యటనకు వెళ్తే కచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వ్యవస్థ ముఖ్యం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

చిత్తూరు (కలెక్టరేట్): ఉపాధ్యాయ సంఘాలు హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరగాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. వ్యక్తిగత లాభం కంటే వ్యవస్థ ముఖ్యమని, వ్యవస్థ కోసం, పేద పిల్లల అభ్యున్నతి కోసం పనిచేయాలని హితబోధ చేశారు. సోమవారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్తంగా 'ఆచరణలు –అనుభవాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా విఠపు మాట్లాడుతూ, ఉత్తమ ఉపాధ్యాయుడు అంటే శారీరక శ్రమతో బోధించేవాడు కాదని, పేద విద్యార్థులను ప్రేమించే వాడని అన్నారు. శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడు గిరిజన తెగల వారితో కలిసి పనిచేసిన అనుభవాలను ఎప్పటికీ మరువలేనని అన్నారు. పదవీకాలం ముగిసిన తాను ఇక జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటానన్నారు. అధ్యక్షత వహించిన యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. ప్రస్తుత తరానికి నాయకులు ఎలా ఉండాలో విఠపు ఆదర్శనీయులని, ఆయన సేవలను ప్రస్తుతించారు. సదస్సులో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంటామోహన్, జన విజ్ఞాన వేదిక నాయకులు మునిరత్నం, గల్లా రంగనాథం, శ్యామల, అరుణ శివప్రసాద్, విజయ్, బిర్లా నాయుడు తదితరులు పాల్గొన్నారు.